# నిర్బంధ ఓటింగ్ విధానంతోనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది

భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం. ప్రజాస్వామ్యానికి మూల స్తంభం ఎన్నికల వ్యవస్థ. భారత రాజ్యాంగం 326 ఆర్టికల్ ద్వారా కుల, మత, ప్రాంత, లింగ, జాతి భాషా అనే భేదం లేకుండా అక్షరాస్యులకు, నిరక్షరాస్యులకు 18 సంవత్సరాల వయస్సు నిండిన భారత జాతీయ పౌరులకు వయోజన ఓటు హక్కును కల్పించింది .

## ప్రపంచ రాజకీయ చరిత్రలో గొప్ప విప్లవాత్మకమైన మార్పు ఓటుహక్కు

ప్రపంచ రాజకీయ చరిత్రలో ఓటు హక్కు గొప్ప విప్లవాత్మకమైన మార్పు. అభివృద్ధి చెందిన దేశాల కంటే ముందే మన దేశంలో వయోజన ఓటు హక్కును భారత రాజ్యాంగం కల్పించి ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసింది. ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసే అవకాశం పౌరులందరికీ కల్పించింది. ఐదేళ్లకు ఒక సారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం తో పాటు తాము కోరుకున్న పాలనను ప్రజలే తెచ్చుకోవచ్చు. 'మన భవిష్యత్తు మన చేతిలోనే ఉంది' అన్న విషయాన్ని ఓటు చాటుతుంది. ఓటు రూపములో భవిష్యత్తుకు మనమే బాట వేసుకునే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించింది. ఓటు అనే రెండు అక్షరాలు దేశ చరిత్రను మార్చి వేస్తుంది. ప్రభుత్వాలను కూలదోస్తుంది. ఓటు తూటా కంటే గొప్పది . ఓటు హక్కు వజ్రాయుధం. ఓటు హక్కును వినియోగించు కోవడం ప్రజల ప్రధాన కర్తవ్యం.

ఓటు హక్కుపై విస్తృత ప్రచారం చెయ్యాలి. కుల మతాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

## ఓటుహక్కు వినియోగం సార్వత్రిక ఎన్నికలు

భారత దేశములో 2023 జనవరి 1 నాటికి నమోదైన మొత్తం ఓటర్ల సంఖ్య 95,50, 25,694 చేరింది.

దేశంలో జనాభాతో పాటు ఓటర్ల సంఖ్య పెరుగుతుంది. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచటానికి ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యలు పోలింగ్ శాతం పెంచడంలో విఫలమైనాయి. .ఓటర్లలో 3వ వంతు పోలింగ్ కు దూరంగా ఉంటున్న స్థితి కొనసాగుతుంది.

దేశంలో1951 నాటికి నమోదైన ఓటర్ల సంఖ్య 68 కోట్లు, 2023 నాటికి 94.50 కోట్లకు పెరిగింది.

యువకులు' పట్టణ నగర ప్రాంతాలలో ఓటర్లు పోలింగులో పాల్గొనడం లేదు. గత లోకసభ సార్వత్రిక ఎన్నికల్లో 3 వవంతు ఓటర్లు పోలింగుకు దూరంగా ఉన్నారని ఎన్నికల కమిషన్ పేర్కోవడం గమనార్హం

దేశములో 1951 లో నమోదైన ఓటర్లు 17.32 కోట్లు వుండగా 45.57 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. దశాబ్దాలుగా దేశంలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిన ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల సంఖ్య పెరుగక పోవడం శోచనీయం.

1957లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య19.37 కోట్లు ఉండగా అందులో 47.74 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నరు.

ఓటర్ల పోలింగ్ శాతాన్ని 75 శాతానికి పెంచటానికి ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తుంది.

2014లో దేశంలో నమోదైన ఓటర్ల సంఖ్య 83.4 కోట్లు పోలింగ్ శాతం 66.44 వుంది. 2019లో లోకసభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నమోదైన మొత్తం ఓటర్ల సంఖ్య 91.2 కోట్లు పోలింగ్ శాతం 67.4.శాతం మించలేదు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 30 కోట్ల మంది పోలింగ్ బూతుకు వెళ్లలేదని ఓటు హక్కు వినియోగించుకోలేదని ఎన్నికల కమిషన్ నిర్ధారించింది.

పట్టణ నగర ప్రజలు యువకులు విద్యావంతులు వలస కార్మికులు ఓటువేయని వారిలో ఉన్నారని తేలింది.ఇటీవల హిమాచల్ ప్రదేశ్ గుజరాత్ అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో పట్టణ ప్రజలు పోలింగ్ లో పాల్గొనకుండా వున్న ఉదాసీన వైఖరిని ఎన్నికల కమిషన్ గుర్తించింది.

## ఉన్న చోటే ఓటు హక్కు వినియోగం

రిమోట్ ఓటింగ్ విధానం, స్వరాష్ట్రములో ఓటరుగా నమోదైన వారు వివిధ కారణాల వల్ల వేరువేరు చోట్లకు వలస వెళ్లిన క్రమములో ఓటు హక్కు వినియోగించుకునే స్థితిలో లేరు

వారి కొరకు రిమోట్ ఓటింగ్ విధానం నూతన సాంకేతికతను ఎన్నికల కమిషన్ ప్రతిపాదించింది.

వినూతనమైన కమ్యూనికేషన్ వ్యూహాల మీద ఎన్నికల కమిషన్ దృష్టిపెట్టింది.

## రాజకీయ ఏకాభిప్రాయం

రిమోట్ ఓటింగ్ విధానం మీద దేశములో వున్న జాతీయ ప్రాంతీయ పార్టీలు 'ఉప ప్రాంతీయ పార్టీల ఏకాభిప్రాయం కావాలి. ఎన్నికల కమిషన్ ప్రతిపాదించిన సంస్కరణలకు ఇచ్చిన సూచనలకు

రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేసిన సంఘటనలు చాలా తక్కువగా ఉన్నాయి. 1962 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 55.42 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు 2009 లో జరిగిన ఎన్నికల్లో 71.70 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 91.20 కోట్లు ఉండగా 67.40 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల వివరాలు

పురుషులు 15048250 స్త్రీలు - 14924718 థర్డ్ జెండర్.1951ఎన్.ఆర్.ఐ 2740 రక్షణ రంగములో పనిచేసే సేవారంగం 15282

మొత్తం 2,99,92,941 వున్నారు. ఓటర్లను తమ ఓటు హక్కు వినియోగం మీద పోలింగ్ బూతుల వారిగా అవగాహన చైతన్యం కలిగించాలి.

> ఓటు రూపములో భవిష్యత్తుకు మనమే బాట వేసుకునే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించింది.ఓటు అనే రెండు అక్షరాలు దేశ చరిత్రను మార్చి వేస్తుంది. ప్రభుత్వాలను కూలదోస్తుంది. ఓటు తూటా కంటే గొప్పది . ఓటు హక్కు వజ్రాయుధం. ఓటు హక్కును వినియోగించు కోవడం ప్రజల ప్రధాన కర్తవ్యం.

## ఎన్నారై ఓటర్లు ఆన్లైన్ ఓటింగ్

ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలో 2.2 కోట్ల మందికి పైగా ఎన్.ర్.ఐ. ఓటర్లు ఉన్నట్లు అంచనా వీరికి త్వరలో ఒక చట్టం తేవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఆన్లైన్ ఓటింగ్ విధానం రిమోట్ ఓటింగ్ విధానం అమల్లోకి వస్తే ఎన్.ఆర్.ఐ లు తమ వోటు హక్కును వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.

## ఓటింగ్ శాతం పెంచడానికి తీసుకోవలసిన చర్యలు

ఎన్నికల కమిషన్ నిరంతరం ఓటర్ల నమోదు కొత్తవోటర్ల చేరికలు డూప్లికేట్ ఓటర్లను దొంగఓటర్లను ఓతర్ల జాబితా నుండి తొలగించే కార్యక్రమాన్ని సమర్థ వంతంగా చేపట్టాలి.

కళాశాల స్థాయిలో ఓటర్ల నమోదు కేంద్రాలను ఏర్పాటు చెయ్యాలి.

ఎలక్షన్ లిట్రసీ క్లబ్ లను నిర్వహించాలి.ఎన్నికల అక్షరాస్యత– బలమైన ప్రజాస్వామ్యం కొసం ఎన్నికల అక్షరాస్యత పరివ్యాప్తిలో యువజన, మహిళా, స్వశక్తి సంఘాలు, పౌర సమాజం స్వచ్ఛంధ, సామాజిక సేవా సంస్థలు క్రియాశీలక పాత్ర పోషించాలి.

## నిర్బంధ ఓటింగ్ విధానం సంస్కరణలు చట్టాలు

ప్రభుత్వం నిర్బంధ ఓటింగ్ విధానం అమల్లోకి తేవాలి. అందుకు అవసరమగు బిల్లు లోకసభలో ప్రవేశ పెట్టి సమగ్ర ఎన్నికల చట్టాలను రూపొందించాలి.

భారత మాజీ రాష్ట్రతి అబ్దుల్ కలాం పేర్కొన్నట్లు మొత్తం ఓటర్లలో 90శాతం ఓటింగ్ జరిగితే దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది అన్న వాక్య యువతకు పట్టణ ఓటర్లకు కనువిప్పు కావాలి.

యువత ఓటువే యడం మీద ఆసక్తి చూపడం లేదు. ఓటు విలువ మీద విస్తృత స్థాయిలో ప్రచారం చెయ్యాలి. ప్రజాస్వామ్యానికి ఓటు వజ్రాయుధం.

గ్రామ సభ, పురపాలక, నగర పాలక సంస్థలు ప్రతి 3.నెలలకు ఒక సారి ఓటు హక్కు వినియోగం ఓటు నమోదు దొంగ ఓటర్ల గుర్తింపు తొలగింపు మీద సమావేశాలు నిర్వహించి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగం పై అవగాహన చైతన్యం కలిగించాలి.

## ఓటు హక్కు వినియోగం మీడియా

మీడియా టివి సినిమా ప్రచార ప్రసార సాధనాలు మాధ్యమాలు ఓటు హక్కు వినియోగం ఓటు విలువ ఓటింగ్ విధానం పట్ల ప్రచారం చెయ్యాలి.

'ఓటరుగా వున్నందుకు గర్వపడుతున్నాను ఓటు వేయడానికి సిద్ధంగా వున్న' అనేది నినాదం కాకుండా ఓటర్ల విధానం కావాలి. లోకసభ, శాసన సభ ,స్థానిక సంస్థల ఎన్నికల్లో విధిగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలి.

ఎటువంటి ప్రలోభాలకులోను కాకుండా సమర్థులైన అభ్యర్థులకు ఓటువేసి ఉత్తమ అభ్యర్థులను ఎన్నుకుం టామని ప్రతిజ్ఞ చెయ్యాలి

అప్పుడే ప్రజలచేత ప్రజల కొరకు ప్రజలు ఏర్పరుచుకున్న ప్రభుత్వం ఏర్పడుతుంది. భలమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రగతి పురోగతి, సంక్షేమం సిద్ధించి దేశ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమౌతుంది.



–నేదునూరి కనకయ్య
9440245771

# మాతృ వందనం

భారత మాతా వందనం
మా భాగ్య విధాతా! వందనం
విశ్వజ్యోతిగా వేదమాతగా
క్రాంతి కాంతి ఆనంద నందనం ॥భారత॥

అఖండ భారత దేశ హితముగా
అన్నిదేశముల నేలిన తల్లి
ప్రపంచ మందున అగ్రరాజ్యముగ
పరిఢవిల్లిన కల్ప వల్లివి ॥భారత॥

శివాజి, రాణా, గుప్తరాజుల
పౌరుషాగ్ని రగిలించిన దేవీ!



కాకతి రుద్రమ, ఝాంసీ, చెన్నమ
వీర వనితలకు జన్మ దాతవు ॥భారత॥

పురాణ పురుషుల పుట్టినిల్లువు
సర్వ శాస్త్రముల ధర్మదాతవు.
అన్నిమతాలను ఆదరించిన
మతాతీత రాజ్యాంగ నేతవు ॥భారత॥

భగత్సింగ్, గాంధీ, సావర్కరు
హుంకరించిన వీర భూమిని
సూర్య చంద్రులున్నంత కాలము
వర్ధిల్లుమా వరాల తల్లివి.. ॥భారత॥



–ఐతా చంద్రయ్య
సెల్: 93912 05299

## బంజారా నానీలు



తండా కూడా
కన్నీరు కారుస్తుంది
గోరటి వెంకన్నా!
జర ఇటు చూడన్నా!!



నగరంలో
ఒంటరినైపోయాను
అడవిలోంచి
జూలోకి

నీ దయ వల్ల
ఎంత మారాను నేను
ఓ నా గ్రామమా
నువ్వలాగే ఉన్నావు





–డా॥ సూర్యా ధనంజయ్
సెల్:9849104187

## ఎండిన రైతు కలలు

కొన్నేళ్ల క్రితం అలా
రాత్రి వెన్నెల్ని మోసి అలసి పోయాను.
ఎండ్ల బండి గంతుల్ని చూసి
మురిసి పోయాను.
గత్తం పొలం లో
చుక్కలుగా ఎగిరింది.

తెల్లవారింది
దుక్కుదున్నటంలో మునిగిపోయాను.
నాగలి అడుగుల్లో కదిలిపోయాను.
ఈ నాగలి రైతు ప్రపంచాన్ని
ప్రపంచపు ఆకలిని ఎత్తి చూపింది.

దృశ్యం మారింది
చిన్నప్పటి నాగల్లు
కాల బంధనం లో ఇరుక్కుని
ట్రాక్టర్లు గా రూపాంతరం చెందాయి.
అయినా కాసింత మార్పే అనుకున్నా

ఇప్పుడు అదే మట్టి
స్థలాల ముక్కలు గానో
కర్మాగారాలు గానో
మనిషి ని నమిలే కారాగారంలానో
మట్టి యంత్రాలతో పరాయిదైంది.

ఇప్పుడు ఇక్కడే
పనికోసం పోరు బాట పడుతున్నారు.
ఉపాధి కోసం ఉప్పెనలా చూస్తున్నారు.

చినిగిన కలల్ని మోసుకుని
వెట్టిచాకిరి బాటలో
మగ్గిపోవాలని చూస్తున్నారు.

రైతు రాజు కావాలి
బానిస కాదు కదా

అర్థం కాని అంకంలో
కిటకిటలాడుతూ
భూమిని సమర్పించిన
రైతుల ప్రాణాలు
దిక్కులు చూస్తున్నాయి.



– గవిడి శ్రీనివాస్
7019278368,9966550601

## నాగన్న పదాలు

వైద్యులు దేవుళ్ళు
నర్సులే సిస్టర్లు
"మంచికి! ప్రణమిల్లు
ఓరి! నాగన్న.

తప్పుడు లాక్డౌన్
వలసల పరేశాన్
"కరోనేరా"? దుష్మన్
ఓరి! నాగన్న.

సుస్వర వర పుత్రుడు
ఎస్పీ బాలు భాసుడు
నవ గాయకులు కిసుడు ఇనుడు.
ఓరి! నాగన్న.

కరోనా దారి కాచి
ఎస్పీబాలును చూచి
కాటు వేసె పిశాచి
ఓరి! నాగన్న.



–నెమలికొండ నాగేశ్వర్ రావు
8688553470

పుస్తక సమీక్ష

# ఆలోచింపజేసే "కుసుమ శ్రీ" కవిత్వం







కవిత్వం ఆలోచింప చేయగల గాలి. కవిత్వం చదివిన బతుకుల్లో వెలుగులు పూయాలి .అది సగటు వాడికి బాసట కావాలి .బాదున్న వారికి ఊరట కావాలి. కవిత్వం ఒక సామాజిక బాధ్యత. ఈ బాధ్యతను పూర్తిగా నెరవేరుస్తూ కలం పట్టిన కవయిత్రి పబ్బ విజయశ్రీ తెలుగు ఉపాధ్యాయురాలిగా అటు ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దుతూ ప్రముఖ కార్యక్రమాలలో మంచి వ్యాఖ్యాతగా రాణిస్తూ అందరి మెప్పును పొందుతూ కలం పట్టి కవితలను పద్యాలను రాస్తూ ఆ కవితల్లో ప్రజల బాధలను చెప్పే మంచి ప్రయత్నం చేస్తున్న ఈ కవయిత్రి రాసిన మొదటి కవితా సంపుటి కుసుమ శ్రీ ఈ సంపుటిలోని అన్ని కవితలు ఆలోచనీయాలే. ఇది విజయశ్రీ మొదటి పుస్తకం

నిత్య చైతన్యవంతమై చైతన్య దిశలో తన కలాన్ని నడిపిస్తూ సాహిత్యం సాహిత్య ప్రయోజనము తెలుసుకుంటూ కవులు రచయితల యొక్క సూచనలతో ముందుకు సాగుతూ కవిత్వం పద్యమే కాకుండా పాటలు వ్యాఖ్యానంతో ముందుకు సాగుతూ ఒక నిజాయితీ గల కవయిత్రిగా ముందుకు వస్తున్న తరుణంలో వేసిన మొదటి పుస్తకమే కుసుమ శ్రీ మొదటి పుస్తకం తోనే మంచి కవయిత్రిగా గుర్తింపు పొందారు

ఈ పుస్తకంలో మంచి కవిత్వాన్ని అందించి సాహిత్యంలో తనదైన ముద్రను వేసింది కవయిత్రి

**నయనాలు తలపిస్తున్నాయి రాయాలని**
**కలతో తెలియని సంఘర్షణలో పదబంధాలను వెతుకుతున్నాయి**
**నింగి నేలను వర్ణించాలని ఆశతో**
అంటూ తన కవితలన్నింటినీ సాగిస్తున్నది.

**పలికేటి భావాలు దృశ్యమై కదిలేట్టు**
**హృదయ స్పందనలకు భావాలు తొడిగేట్టు**
**బుద్ధి వికసించి పరవశమై పాడేట్టు**
**ఉగ్గుపాలతో కమ్మని అమ్మ కథలు విన్నట్టు**
**ఉండాలి నా కవిత శిశువుకు ఊయలయేట్టు** అంటూ రాయాలి

**ఓ కవిత**

శీర్షికన రాసిన కవిత లో తన కవిత్వం ఎలా ఉండాలో ఏ విధంగా సాగాలో స్పష్టంగా తెలియజేశారు కవికి తన కవిత పట్ల ఎంతో అభిమానం ఉంటుంది ఆ అభిమానం ఇక్కడ ఈ కవితలో మనకు కనిపిస్తున్నది. కవికి ఒక నిర్దిష్టమైన ఒక సహజ శైలి ఉంటుంది ఆ శైలి మనకు ఇక్కడ కనిపిస్తున్నది. అదేవిధంగా **"ఆకలి కేకలు"** అనే కవితలో

**"భాషలేని ఆకలి మంటల అనావృష్టి ఒకవైపు**
**విందు వినోదాల అజీర్ణపు అతివృష్టి ఒకవైపు–1పొర్లిపోయే ఆనందపు మురుగులచట**
**ఎండిన దేహపు వరుగులిచట"**

అంటూ అనాదికాలంగా సమాజంలో ఉన్న బీద ధనిక తేడాలను తెలియజేస్తూ ఈ తేడాలన్నీ సమసిపోవాలని తన కవిత దీనికి ఒక మార్గం కావాలని కవయిత్రి ఆశిస్తున్న తీరు ఆకట్టుకుంటుంది.

కవి ఎప్పుడు సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నిస్తుండాలి. అంధకారంలో ఉన్న సమాజాన్ని వెలుగులోనికి తీసుకెళ్లే ప్రయత్నం తన అక్షరాల ద్వారా కవి చేయగలుగుతాడు. అందుకే రవి కవి ఒకటే .రవి ఈ జగానికి వెలుగునిస్తే కవి ఈ సమాజాన్ని చైతన్య పరుస్తాడు

కవయిత్రికి ప్రకృతి పట్ల పరిశీలన శక్తి ఏ విధంగా ఉందో ఈ కవితలో మనం చూద్దాం

**గట్ల వెంట పోతుంటే**
**గుంటలోనికి వంగి వేలాడుతున్న**
**గిజిగాడి గూడు అద్భుత సృష్టి కాదా.**
**పుట్టిన పాపకు అర్థం తెలియని పాట**
**అమ్మ పాడితే ఆనందంగా నిద్రించిన చిత్రం**
**అద్భుత సృష్టి కాదా.**
**చిట్టి ప్రాణి మినుగురు పురుగు**
**వెలుగులతో చీకటికి చురకలేయుట**
**అద్భుత సృష్టి కాదా.**

అంటూ అద్భుత సృష్టి కవితలో తాను చూసిన ప్రకృతిని వర్ణిస్తూ కవయిత్రి ప్రశ్నలు వేయడం జరిగింది .ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యత. ప్రకృతి పట్ల ప్రకృతి సంరక్షణ పట్ల కవులు సమాజాన్ని చైతన్య పరచాలి. అది కవి బాధ్యత ఆ బాధ్యతను ఈ పుస్తకంలో కవయిత్రి అడుగడుగున నెరవేర్చింది అని చెప్పవచ్చు.

**హోయి గొలుపే పచ్చని పరకలు గని మేఘం**
**పిల్లగాలులతో రాల్చను చిటపట చినుకులు**
**సొగసైన వనరాసులను చూసిన వారిదాలు**
**కారు మబ్బులు కొంటె చూపుల ప్రేమల**
**జరివానలు వర్షించు**

అంటూ **"మేఘం వృక్షాల బంధం"** కవిత.

ప్రకృతిని ఆరాధించి రాసిన కవిత లాగా ఇది అందరినీ అలరిస్తుంది. ఈ కవితలో మంచి పదాలు ఉన్నాయి.

ఇది ఆలోచింపజేసే కవిత.

ఇక జీవిత సత్యం అనే కవితలో చాలా సత్యాల విశ్లేషణకు కవయిత్రి వెళ్లారు.

**గమ్యం తెలియని నడక**
**గతులు లేని జీవితం వ్యర్థమే**
**కాళ్లు తడవకుండా నదిని దాటలేము**
**కళ్ళు తడవకుండా బతుకు బండిన సాగలేము**
**కష్టసుఖాలు కావడి కుండలు**
**ఆకాశంలో ఆశలవిహంగమై**
**గాలిపటంలా తేలిపోతే రెప్ప విప్పే లోపే మృత్యు కౌగిలిలో చేరిపోతాము**

అంటూ నిత్య సత్యాలను చెప్పారు. అదేవిధంగా కవయిత్రి విజయాలను ఏ విధంగా స్వీకరి స్తుందో విమర్శలను కూడా అదే విధంగా స్వీకరించే మనసు ఈ కవయిత్రికి ఉందని చెప్పవచ్చు.

విమర్శలనే నా ప్రతిబింబాలుగా స్వీకరించి

**పడిన చోటే లేవాలన్న సూక్తితో**
**పడి లేచి ఎగిసే కెరటవుతాను.**
**నాకు నేనుగా ఆకాంక్షల ఆత్మస్థైర్యాన్ని ఆహ్వానించి**
**అనంత గుణ ఖనిజ మవుతాను**
**నాకు నేనుగా కువిమర్శల పాలిట త్రిశూలమవుతాను.**

అంటారు .ఈ విధంగా ఈ పుస్తకంలో కవితలతో పాటు కొన్ని రూపాయిలు కూడా ఉన్నాయి .వాటిని చూసినట్లయితే

**ఒక్క పిలుపు చాలు అనురాగ దీప్తికి**
**ఒక్క స్పర్శ చాలు మమకార తృప్తికి**
**మంత్రమై కనికట్టు చేయు లే ప్రేమ**
**ఆర్ధత తప్పదులే ప్రతి హృదయానికి**
**చక్కటి వర్ణన పాడటానికి కూడా చాలా ఇంపుగా ఉండే పదాలు . మమకార తృప్తికి ఒక్క స్పర్శ చాలు**

అంటారు . రాగ దీప్తికి ఒక్క పిలుపు చాలు అంటున్నారు. సుందర సుమనోహర భావాల అలంకారాలు ఈ వాక్యాలు.

అదేవిధంగా

**వెదలు లేని గొప్ప కథలు ఉన్నాయా**
**మడతలు లేని పేజీలు ఉన్నాయా**
**కష్టమనే గాయం దారి చూపగా ప్రకాశించని దీపాలు ఉన్నాయా**

ఎంతో అనుభవంతో రాసిన ఈ పదాలు ఎంతో భావాన్ని కలిగి ఉన్నాయి .ఇలాంటి భావాలను ఎన్నింటినో మనం ఈ పుస్తకంలో చూడవచ్చు. ప్రతి కవితలో ఆలోచింపజేసే వాక్యాలను మనం చూడవచ్చు. ఈ పుస్తకంలో ముగధ కెంతో ఒద్దికో.

రాయాలని ఆరాటం పల్లెవాసవ టు పటించవే కోరికలే గుర్రాలైతే కాటు వేసే కేటుగాళ్లు జీవితం ఓ గాలిపటం. జ్ఞాన పోత బాల్యపు మధువులు ఎక్కడ హరితహారం ఆమెలో తుఫాను

ఇలాంటి మేటి మంచి కవితలు ఉన్నాయి

అదేవిధంగా ప్రతి కవిత ఒక చైతన్య దీప్తిగా మనం గుర్తించవచ్చు. ఈ పుస్తకం అందరూ చదవదగినది.

మొదటి పుస్తకం తోనే అందరి మన్నన లను పొంది కవయిత్రిగా రాణిస్తున్న ఈ కుసుమ శ్రీ విజయ శ్రీ మరెన్నో పుస్తకాలను రాసి మంచి కవిత్వాన్ని సమాజానికి అందిస్తుందని తప్పకుండా మనం ఆశించవచ్చు

–రచయిత్రి
పబ్బ విజయశ్రీ
కామారెడ్డి జిల్లా
9247235186



–సిరిసిల్లా గఫూర్ శిక్షక్,
9849062038

# అమ్మ ఆశయం

కథ

సభా ప్రాంగణం అంతా కోలాహలంగా ఉంది మల్లీ అనే 22 సంవత్సరాల యువతి అక్కడికి టయోటా కారులో వచ్చి దిగింది. మల్లికి స్టేజ్ పైన గోడకు పెద్దగా నిలవెత్తు ఫ్లెక్సీ మేడం సుజాత గారిది ..చూస్తూనే కళ్ళు చెమ్మగిల్లాయి.

ఎర్రటి తివాచీపై మెల్లగా నడుచుకుంటూ స్టేజి పైకి ఎక్కింది అందరిని పరికించి చూసింది. అందరూ మల్లి సుజాత కోసం ఏమి చెబుతుందో అని ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు.

నిలువెత్తు ఫ్లెక్సీని అలా చూస్తున్నా మల్లి ఆలోచనలు గతంలోకి పరుగులు తీసాయి.

6 ఏళ్ల వయసప్పుడు మల్లీ కోయగూడెం నుండి ఆహార సంపాదనకై పల్లెకు వచ్చిన అనాధ. ఆహారం కోసం బస్ స్టేషన్ లో అడుక్కుంటున్న మల్లిని చేరబిలిచి అనాధాశ్రమంలోకి తీసుకొచ్చింది సుజాత. ఆ రోజు నుండి తన ఆలనా పాలనా చూస్తూ చదువు చెప్పి నేడు ఒక వైద్యాధికారిగా వృత్తిని చేపట్టేలా చేసిన మహా వ్యక్తి. ఎప్పుడు చిరునవ్వు ఆభరణంగా గల అమ్మ అలసట అనేది ఎరుగదు. తనలాంటి ఎంతోమంది అనాధలను చేరదీసి అన్నీ తానై తల్లిదండ్రులు లేని లోటును తెలియనివ్వకుండా పెంచింది. సుజాతను అందరూ అమ్మ అని పిలిచేవారు. సుజాతకు పిల్లలు లేరు.

భర్త సైనికుడు పాకిస్తాన్ కాల్పుల్లో వీర మరణం చెందిన వీరుని భార్య. భర్త జ్ఞాపకాలను ప్రోదిచేసిన ఒక పెంకుటిల్లు ఆరు మామిడి చెట్లు కలిగిన ఆవరణంలో ఉంటూ ప్రభుత్వం అందించే పెన్షన్ తో తనలాంటి ఎంతోమందికి విద్యను అందించింది. తను కొవ్వొత్తిలా కరుగుతూ ఇతరుల జీవితాల్లో వెలుగును నింపిన సాధ్వీమణి ఇలా హఠాత్తుగా కానరాని లోకానికి వెళ్లడం మల్లి మాత్రమే కాదు అక్కడున్న వారు ఎవరు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఇప్పుడు అందరి మెదుడుల్లో తొలుస్తున్న ఏకైక ప్రశ్న అనాధాశ్రమం నిర్వహించబడుతుందా? లేక మూసివేస్తారా? మూసివేస్తే అక్కడ ఉన్న అనాధల పరిస్థితి ఏమిటి?

మల్లి కంట్లో నుండి రెండు కన్నీటిబొట్లు నేలరాలాయి. తదేకంగా మల్లి నే చూస్తూ..ఉన్న సభ నిర్వాహకులు మల్లి గారు మాట్లాడండి అన్న మాటతో ఇహంలోకి వచ్చిన ఆమె దృఢనిశ్చయానికి వచ్చినదై..

సభకు నమస్కారం ఈనాడు నేను ఈ స్థాయిలో మీ ముందు నిలబడడానికి కారణం అమ్మ ఆశయం చాలా గొప్పది తన జీవితాన్ని నాలాంటి అనాధల చదువు కొరకు అంకితం ఇచ్చింది ఎందరో అనాధలకు అమ్మగా వారి బ్రతుకులను మలిచింది.

అన్నదానం కన్నా విద్యాదానం గొప్పది. వెలుగుతున్న కొవ్వొత్తే మరిన్ని కొవ్వొత్తులను వెలిగించ గలదు. అమ్మ ఆశయం వమ్ము కానివ్వను ఈ ఆశ్రమం బాధ్యతలు నేను తీసుకుంటున్నాను. అనడంతో చప్పట్లతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అమ్మ చిరునవ్వుతో మల్లిని దీవించిన చల్లని చేతిస్పర్శ కలిగిన భావన కలిగింది మల్లికి.



–సి. హేమలత
9666779103

# భువన మోహనం పుస్తకావిష్కరణ





పుస్తకావిష్కరణలో అతిథిలు

సమాజ హితం కోరుతూ విశ్వమానవ కళ్యాణంకై కవులు తమ రచనలను కొనసాగించాలని,గొప్ప గొప్ప మహనీయులను తయారు చేసినవి కవుల రచనలేనని ప్రముఖ పిల్లల వైద్యులు సినారె పురస్కార కమిటీ ఛైర్మన్ డా.ఎడవెల్లి విజయేందర్ రెడ్డి అన్నారు . ఆగష్టు 27 ఆదివారం రోజున భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ అధ్యక్షులు వైరాగ్యం ప్రభాకర్ ఆధ్వర్యంలో కరీంనగర్లోని వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో నగునూరి రాజన్న రిటైర్డ్ డిప్యూటీ మేనేజర్ (ఫైనాన్స్) ఎన్.టి.పి.సి. లిమిటెడ్ గారి గేయ సంపుటి "భువన మోహనం" పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "సమాజానికి కవులు చక్షువులని, భువన మోహనం సంకలనంలో దేశభక్తి,దైవభక్తి,సమాజం,పర్యావరణం, మానవతావాదం తదితర విభిన్న అంశాలున్నాయని" అన్నారు.పుస్తక స్వీకర్త మరియు విశిష్ట అతిథి దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ "రాజన్న గేయాల్లో అయన ఉత్తమ వ్యక్తిత్వం,సున్నిత మనస్తత్వం మరియు సామాజిక చింతనలు ప్రదర్శితమౌతున్నాయని" అన్నారు మరొక విశిష్ట అతిథి ప్రముఖ కవి, విమర్శకులు గంటా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ " కవి సమాజాన్ని బతికించాడు,రాజులను బతికించాడు,వ్యక్తులను, వ్యవస్థను బతికించాడు.కవి అనధికార శాసనకర్త, చరిత్రకారుడు.కవికి మరణమెక్కడిది, వాల్మీకి వారసుడికి.కన్ను మూసే వరకు కలాన్ని నిద్రపోనివ్వకు,కనుమరుగై పోయినా కాలంపై ముద్ర వేయడం మానవద్దని కవులకు సూచించారు.కవిత్వంలో తనకు మార్గదర్శనం చేసిన గురు సమానులు దాస్యం సేనాధిపతికి తన గేయ సంపుటిని వినమ్రంగా అంకితమిచ్చి,దుశ్శాలువ పూలదండతో సత్కరించారు.ఉదయసాహితి వ్యవస్థాపక అధ్యక్షులు గౌరవ అతిథి శ్రీదాస్యం లక్ష్మయ్య మాట్లాడుతూ"నగునూరి రాజన్న గేయాలు సందేశాత్మకంగా ఉన్నాయని" అన్నారు.కవయిత్రి, ఉపాధ్యాయులు బుర్ర విజయలక్ష్మి నాగరాజ్ ఆహ్వానం పలకగా కవి, విశ్రాంత ప్రధానాచార్యులు అన్నాడి గజేందర్ రెడ్డి పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కవి గులాబీల మల్లారెడ్డి,తెరసం అధ్యక్షులు కొత్త అనిల్ కుమార్,నడిమెట్ల రామయ్య ,సింగిరెడ్డి రాజిరెడ్డి, మాంకాళి సుగుణ ,పురుషోత్తం సతీష్ ,సిరిపురం వాణిశ్రీ,, యోగాచార్య సంపత్ కుమార్ ,విజయశ్రీ,జలంధర్ రెడ్డి, నగునూరి రాజన్న బంధుమిత్రులు పాల్గొన్నారు.

## మొలకెత్తిన తీజ్

తీజ్ సంబరం.......
విత్తనం పండుగ!

తండా తండాలలో
తండా పెద్ద ఆశీస్సులతో
తీజ్ ఉత్సవంగా !

మా సంస్కృతి
నెత్తిన వెదురు బుట్ట
దరిచేరే చిమలపుట్ట
చంకి అద్దాలతో
ధరించే కొత్త బట్టలు.

గోధుమ విత్తనాలతో
మొలిచెను కలల తోట
జానపదుల బాణిలో
ధూందాం పాట!
పోడువు కథలతో

యువతి యువకుల
భలే గమ్మత్తైన ఆటలు
చిక్కుముడి వీడకుంటే
కడతారు!
ప్రశ్నల ఆనకట్ట?
చెంబులోని జలం సారేసి
పడతారు తిరుగుపాట
ధాన్యరాసులు కళాకళలాడే
ప్రతి ఇంట !!

నవరాత్రులతో
పులకరించే ప్రకృతి
తొమ్మిదో రోజున నైవేద్యాలతో
దీక్ష పూర్తి!!
మా చెలికత్తె తీజ్ పై
నీదే రక్ష జలజాల
కారేసు
అశ్రవులు అనంతం
బంజారాల సంస్కృతికి
ప్రతీక తీజ్ పండుగ !!

–బి.ప్రవీణ్
8142460664

# నీవు సల్లగుండాలె

(వచన కథా కావ్యం-32)

కాలం కలిసి రానప్పుడు
మనవేలే మన కంట్లో గుచ్చుకుంటది
ఆడదాని ఒంటరి పోరాటం
అరిటాకు చందమే కానీ
అరిటాకుకూ కోసే పదనుంటుంది
'ఈనె'కు దేనికీ లొంగని గుణముంటుంది
పట్టుదల చూపగలిగితే
ఆకు మేకై భయపెడుతుంది
నిస్సహాయ స్థితిలో కూడా
భార్యను నీచంగా చూసిన దర్శనం
గొప్పగా ఏమీ వెల్లదీస్తలేదు
దరిద్రానికీ, బలహీనతకూ
మోసపోవడం జీవ లక్షణం!
ఎన్ని ప్రయత్నాలు చేసినా
ఎంత తండ్లాడినా
ఎల్లయ్య గొంగడి తీరుగనే
ఉండి పోయిండు వాడు
అందరూ అవకాశవాదులే అయినప్పుడు
ఎవ్వరి కడుపూ నిండదు
చావలేక బతుకుతున్న బతుక్కు
భార్య సరయు గుర్తుకొచ్చింది
ఆమె దప్ప తన నాదుకునే దిక్కు లేదని
ఆలస్యంగా నైనా తెలిసొచ్చింది
ఇంటెనుక సచ్చినా అది ఇల్లేనన్న తెలివొచ్చింది
కాళ్ళ మీద వడితే కనికరిస్తుందన్న ఆశ
ఇంటి ముందరికి తెచ్చింది!
అనుభవాల గాయాలు సలపరం పెడుతుంటే
ఆగని కన్నీరు సరయులోని
ఆడతనాన్ని గుర్తుచేసింది...
కానీ,
ఇటువంటి అవసరాల అగడ్తలు
కన్నీటి కొలనులు దాటుకొని
శానా ముందుకు నడిచిందామె
మొగుడితో ఒక మాట కూడా మాట్లాడలేదు
అత్తమ్మ వాని మీద దుమ్మెత్తి పోసింది
అంతా కడిగి పారేసింది
చెప్పింది వింట
పెట్టింది తింట
కుక్కలా పడి ఉంటానని
వానితోనే అనిపించింది
అత్తమ్మ చాతకాకుండయితున్న సమయానికి
ఇతని కాపలా అవసరమేననిపించింది
ఇంట్లో ఒక వస్తువును చేసేందుకు
పరోక్షంగానే అంగీకరించింది
అదే వానికి భాగ్యం!
ముగిసింది వాని దౌర్భాగ్యం!!
'నీవు సల్లంగుండా'లని
సరయు వంక చూసి
మనసులోనే దండం పెట్టుకున్నాడు...



-దోరవేటి
సెల్:9866251679

# ఇవాళ 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' కమిటీ తొలి సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6:దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంపై సాధ్యాసాధ్యాల అధ్యయనం కోసం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ తొలి అధికారిక సమావేశం ఇవాళ జరునున్నట్లు సమాచారం. కమిటీ ఛైర్మన్ రామ్‌నాథ్ కోవింద్ నివాసంలోనే ఈ సమావేశం నిర్వహించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

కాగా, దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణపై గత కొంతకాలంగా చర్చ జరుగుతూ వస్తున్నది. జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై కూడా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు జమిలి ఎన్నికలతో ప్రయోజనాలు ఉన్నాయంటే, ఇంకొందరేమో జమిలి ఎన్నికలతో ఒరిగేదేమీ లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికల నిర్వహణపై ఓ క్లారిటీ కోసం కమిటీని నియమించింది.

# నకిలీ వజ్రాల విక్రయ ముఠా అరెస్ట్



అమరావతి, సెప్టెంబర్ 6:నకిలీ వజ్రాలను విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని పలమనేరులో తొమ్మిది మంది నకిలీ వజ్రాలను విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని అరెస్ట్ చేయడంతో పాటు నకిలీ వజ్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బైరెడ్డిపల్లె మండలం చీలంపల్లె గ్రామానికి చెందిన బి.సుబ్రహ్మణ్యం, సి.సుబ్రహ్మణ్యంలు తక్కువ ధరకే వజ్రాలు ఇస్తామని నాగమంగళంలో టీకొట్టు నడిపే సల్మాన్ ను మోసగించేందుకు పన్నాంగం పన్నినట్లు తెలిపారు.

ప్రస్తుతం తమకు రూ.10వేలు ఇస్తే తమ వద్ద ఉన్న రెండు వజ్రాలు ఇస్తామని, ధర తర్వాత మాట్లాడుకుందామని చెప్పడంతో సల్మాన్ రూ.10వేలు ఇచ్చి వాటిని తీసుకున్నాడు. వెంటనే వాటిని తీసుకెళ్లి పరీక్షించగా నకిలీవని తేలడంతో మోసపోయినట్లు గుర్తించిన సల్మాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు నకిలీ వజ్రాల విక్రయదారులను మొత్తం తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 36 నకిలీ వజ్రాలను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

ఈనెల 9న ఆంధ్ర విశ్వవిద్యాలయం 90 వ స్నాతకోత్సవంలో

# ఇనాక్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

అసాధారణ సాహితీమూర్తి పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్ గారికి ఆంధ్ర విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. 1959లో అదే యూనివర్సిటీ నుంచి బి.ఎ. ఆనర్స్ పూర్తి చేశారు. అదే విశ్వ విద్యాలయంలో అధ్యాపకులుగా ప్రస్థానం ప్రారంభించిన ఇనాక్ గారు తన 85వ ఏట అదే విశ్వ విద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకోనున్నారు.



దళిత భూమి లోంచి చొచ్చుకు వచ్చి ఎన్నో కష్టాలు వివక్షలు ఎదుర్కొని ఎదురీది సాహితీ విద్యా వటవృక్షంగా మారిన ఇనాక్ గొప్ప ఆదర్శ ప్రదాత. ఆరున్నర దశాబ్దాలుగా అలుపెరుగని సాహితీ సేద్యం చేస్తున్న గొప్ప రచయిత. సాహిత్య రంగంలో అన్ని ప్రక్రియల్లో రచనలు చేసిన సాహితీవేత్త. పిహెచ్ డి చేసిన శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాల యానికే వైస్ ఛాన్సలర్ అయిన మహా మేధావి, అంతకు మించిన గొప్ప మనవతా మూర్తి ఇనాక్ గారు. కర్నూలు లోని రా యల సీమ యూనివర్సిటీ నుంచి కూడా ఆయన గౌర వ డాక్టరేట్ అందుకు న్నారు.

అత్యున్నత స్థాయికి చేరినా మూలాలను మర చిపోని స్ఫూర్తి శిఖరం ఆయన. ఎలాంటి భేషజాలు వుండవు. ఎంతో ఒదిగి ఉంటారు. ఎం తో ప్రేమ గా ఆత్మీయంగా పలక రిస్తారు. ఎప్పుడ యినా ఏ కార్య క్రమానికి పిలిచినా "వస్తున్న" అని వెంటనే చెప్పడమే కాకుం డా, కార్యక్రమం రోజున ఖచ్చితంగా సమయానికి వచ్చేస్తారు. సంద ర్భోచితంగా చక్కగా ప్రసంగిస్తారు. చక్కటి పంచె కట్టులో చెదరని చిరు నవ్వుతో ఉట్టిపడే ప్రేమ కళ్ళతో నిలువెత్తు తెలుగు సంత కంలా కనిపిస్తారు. చదివిన యూనివర్సిటీలో చదువు చెప్పిన యూనివర్సిటీలో ప్రతిష్ఠాత్మక గౌరవం పొందడం అంటే హిమాలయాల అంచులను తాకిన సంబరమే! ఒకరిద్దరికి మాత్రమే లభించే అరుదైన మహా గౌరవం ఇది. ఆంధ్ర విశ్వవిద్యాలయం 90వ స్నాతకోత్సవం సందర్భంగా ఈనెల 9న విశాఖ యూనివర్సిటీ ఆడిటో రియంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం జరగనున్నది.

-డా॥మహ్మద్ రఫీ.

# సునందామృతం

## ఖలే కపోత న్యాయము

ఖలః అంటే కళ్లము, భూమి,నేల, ప్రదేశము,కుప్ప, అనే అర్థాలతో పాటు దుష్టుడు అనే అర్థం కూడా ఉంది. కపోతం అంటే పావురం.

కళ్ళంలో పావురాలు గుంపుగా వాలి గింజలు తింటూ వుండగా వేటగాడు వచ్చి వల వేస్తాడు. అది గమనించిన పావురాలు భయపడకుండా అన్నీ కలిసి ఒక్క సారిగా వలతో సహా పైకి ఎగిరి పోవడాన్ని ఖలే కపోత న్యాయము అంటారు.

గుంపుగా ఉన్న పావురాలన్నీ వలలో చిక్కుతాయి. తన పంట పండినట్టే అని సంబర పడిన వేటగాడికి ఆశ అడియాసే అవుతుంది. తన వల కూడా లేకుండా పోతుంది. వాటి ఐకమత్య బలం ముందు తాను వేసిన వల, పన్నిన ఉపాయం ఎందుకూ పనికిరాకుండా పోతాయి.

ఐకమత్యంతో ఆపద నుండి బయట పడవచ్చునీ, అత్యాశ పనికి రాదని చెప్పడానికి ఈ ఖలే కపోత న్యాయమును రెండు విధాలైన ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మన చిన్నప్పుడు పెద్దలు ఇలాంటి పంచతంత్ర కథలు ఎన్నో చెప్పేవారు. పావురం పేరు చిత్ర గ్రీవం. పావురాల నాయకుడు. ఓ సారి గుంపుతో కలిసి ప్రయాణం చేస్తూ ఉన్నపుడు అడవిలో నేలపై ఓ చోట గింజలు కనబడతాయి. అవి చూసిన పావురాల గుంపు "మేత ఎక్కడెక్కడో వెతుక్కో కుండా ఒక్క చోటే దొరుకుతోంది తిందాం పద " అని తొందర పెడుతుంటాయి.

"ఇదేదో మోసంలా ఉంది. అడవిలో అంత ధాన్యం ఒకే చోట రాశిగా ఉండదు. కాబట్టి అక్కడ వాలొద్దు" అంటాడు చిత్రగ్రీ వుడు.

అయినా నాయకుడి మాటలు ఖాతరు చేయకుండా ఏం కాదంటూ కింద వాలడం, వెంటనే వేటగాడి వలలో చిక్కుకోవడం జరుగుతుంది. అప్పుడు చిత్ర గ్రీవుడే ధైర్యం చెబుతాడు, వలతో సహా పైకి ఎగరమని సలహా చెప్పి, తన స్నేహితుడైన హిరణ్యకుడనే ఎలుక దగ్గరకు తీసుకొని పోతాడు. ఎలుక వలను కొరకడంతో పావురాలు అపాయం నుంచి బయట పడతాయి.

ఇందులో మరో కోణం చూద్దాం. సరైన నాయకత్వం ఉంటే ఎలాంటి క్లిష్టమైన సమస్యలనైనా ఆ నాయకత్వపు దిశా నిర్దేశంలో సంఘటిత బలంతో సాధించుకోవచ్చు అనేది గమనించవచ్చు. సంఘటిత ఉద్యమాలతో సాధించుకున్నవన్నీ ఈ ఖలే కపోత న్యాయమునకు చక్కని ఉదాహరణలు.



-పురిమళ్ల సునంద
9441815722

# ఉరి వేసుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య

అమరావతి, సెప్టెంబర్ 6:కర్నూలు జిల్లా ఆదోనిలో విషాదం చోటు చేసుకుంది.. పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ సందీప్ ఇంట్లో ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదోని డిఎస్పి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా సందీప్ వీధులు నిర్వర్తిస్తున్నాడు. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ సందీప్ కు భార్య హేమలత, కూతురు సహస్ర ఉన్నారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆదోని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

# కడప రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు తప్పిన గూడ్స్

అమరావతి, సెప్టెంబర్ 6: కడప రైల్వే స్టేషన్ సమీపంలోని ఎర్రముక్కపల్లి వైపు ఉన్న గేటు వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పింది, మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో బియ్యం లోడ్ తో వచ్చినటువంటి గూడ్స్ రైలు షెడ్డులోకి వెళ్లి రివర్స్ కొట్టే ప్రయత్నంలో ఉండగా రెండు బాక్సులు పట్టాలు పట్టాలు తప్పడం జరిగింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టము జరగలేదు స్వల్పంగా ఆర్థిక నష్టం ఉన్నప్పటికీ రవాణాకు కూడా పెద్దగా ఇబ్బంది ఉండదు అన్నట్లు అధికారులు ధృవీకరిస్తున్నారు,

కడప వైపు నుంచి తిరుపతి వైపు వెళ్లే ప్యాసింజర్ రైళ్లు ప్రస్తుతానికి ఏవి లేవని రాత్రి 12 గంటల సమయం కి వచ్చే గుంటూరు ప్యాసింజర్ రైలు సమయానికల్లా అధికారులు రైలు పట్టాను పునరుద్ధరించే అవకాశం ఉందని తెలిపారు, కడప నుంచి ముంబై వైపు వెళ్లే రైలు మార్గం కు మాత్రం ఎటువంటి ఆటంకం లేదని తెలిపారు. సగటుల ప్రాంతాన్ని వెంటనే అధికారులు పర్యవేక్షించిన ర రైల్వే అధికారులు, రైల్వే పోలీసులు ఆర్పీఎఫ్ సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు జరిగింది, రైల్వే లైన్ పట్టాల పునరుద్ధరణ కోసం వెంటనే సంబంధిత రిక్రూట్మెంట్తో గుంతకల్ నుంచి కడపకు అధికారులు సంబంధిత సామాగ్రితో బయలుదేరినట్లు అధికారులు తెలిపారు.



మందారం సాహిత్య సమాఖ్య
నిజామాబాద్

# కథల పోటీ

**కీ॥శే॥దారం శ్రీధర్ రావు స్మారక జాతీయ స్థాయి కథల పోటి 2023**

సాహిత్య, సామాజిక కార్యక్రమాల్లో భాగంగా 2023లో నిర్వహిస్తున్న(కేవలం తెలుగు భాషలోమాత్రమే)కథలను ఆహ్వానిస్తున్నాం.

**నియమ నిబంధనలు**

1. కథలు తెలుగు సంస్కృతికి సంబంధమైనవై ఉంటు నైతిక విలువలతో బాటు సమాజానికి సందేశమిచ్చేవై ఉండాలి.
2. కథ నిడివి చేతి రాతలో ఏ4 సైజు పేపర్లలో 5 పుటలు,అదే డి.టి.పి అయితే ఏ4 సైజు పేపర్లలో 4 పుటలు(పేజీకి ఒక వైపు మాత్రమే) రాయాలి.
3. హామీ పత్రం తప్పని సరి. తాను రాసిన కథ తన స్వీయ రచనలు అని, మరే భాష నుండి తర్జుమా గాని,సేకరణ గాని చేయలేదని, ఈ కథ ఇంతవరకు ఏ పత్రికలో గాని,మరే ఇతర ప్రింట్ మీడియాలో గాని, రాలేదని, తెలుపుతూ ప్రస్తుతం మొదటి సారి మాత్రమే పంపుతున్నానని, ఒక ప్రత్యేక కాగితంపై రాసి సంతకం చేయవలయును.
4. కథ రాసిన ప్రతులపై శీర్షిక పేరు తప్ప మరింకేమీ రాయకూడదు.
5. న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన మూడు(3) కథల్లో
   **మొదటి బహుమతికి 4 వేల రూపాయలు,**
   **రెండో బహుమతికి మూడు3 వేల రూపాయలు,**
   **మూడో బహుమతికి 2 వేల రూపాయల చొప్పున,**
   **అలాగే 5 గురికి ప్రోత్సాహక బహుమతులు:**
   ఒక్కొక్కరికి 5వందల రూపాయల చొప్పున బహుకరించి, సన్మానించ బడును. అలాగే పోటీకి ఎంట్రీ పంపిన రచయిత లందరూ సన్మానాన్ని అందుకుంటారు.
6. కథలు కేవలం తపాళ(పోస్టు)ద్వారా లేదా స్వయంగా మాత్రమే స్వీకరించ బడును.
7. కథలు చేర వలసిన ఆఖరు **తేది:10.10.2023.**
   ఆ తర్వాత వచ్చే వాటిని పరిశీలించబడవు.

**కథలు పంప వలసిన చిరునామా:**
కన్వీనర్:**దారం గంగాధర్,** ప్రశాంత నిలయం, 5.11.12,
ఎల్లమ్మ గుట్ట వీధి, సోనీ ఫంక్షన్ హాల్ రోడ్డు,
నిజామాబాదు -503001.తెలంగాణ రాష్ట్రం.
సెల్:98483 84777,98484 84777,984 86777.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 945వ రోజు 'ఆప్యాయత' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'ఆప్యాయత' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

## పిలుపులో...

పిలుపులో
ముఖకవళికల్లో
గళంలో
తొణికే పదాల అందం
మానవతకు గెలుపు
మరువలేని మానవత్వ
మందారాల మకరందం.
అమ్మా అన్న పదం
అమ్మకే కాదు
పసిపాప కసిగందుకి
అమృతపు సోన
పెద్ద చిన్న తేడా లెంచని
సుధామధుర భాష భావం.
నాయనా బాబూ అంటే
కాదు చిన్నతనం
వయసుతో పనిలేని మెచ్చుకోలు
చూడగానే చిర్నవ్వు చిందించు
పన్నీటి జల్లులు.
హుస్నాబాద్ తనుశ్రీ
పుట్టుకతోనే లేని హస్తాలు
కాలివేళ్ళతో అన్న నోటికి
అందించే మిఠాయి
ఆప్యాయతకు పరాకాష్ఠ.
మూగజీవాలు కూడా
తలాతోక ఊపుతూ చూపే
ప్రేమ ఆప్యాయత
నేటి మనిషిలో తరిగి కరిగి
పాషాణంగా మారుతున్న వైనం.
మాటలతో పనిలేని
మంచి మనసుకే
ఆప్యాయత అంటే తెలుసు.

-ఎ.రాజ్యశ్రీ

## వెల కట్టలేనిది

ఆప్యాయత వెలకట్టలేనిది
అంచనాలకు అందనిది
హృదయం నుండి ద్రవించేది
జాలి నుండి పరిణితి చెందినది
కన్నపిల్లలపై ఆప్యాయత
హృదయ స్పందనకు నిదర్శనం
ఆప్యాయత అనురాగాలు
తోబుట్టువులు
తనవారు అనుకుంటేనే
ఆప్యాయంగా పలకరిస్తారు
తనవారి లొల్లిని సైతం
ఆప్యాయంగా స్వీకరిస్తారు
ఇతరులైతే విసుక్కుంటారు
పిల్లలలో వ్యత్యాసం చూపొద్దు
సమ భావమే సమాజ హితం
మనషికి విలువ తగ్గి
మనీకి విలువ పెరిగినకొద్దీ
ఆప్యాయత అడుగంటి పోతుంది
పెదవులపైననే అది కనిపిస్తుంది
కాల మహిమా
కర్మ ఫలితమా
పండితులకే తెలియాలిమరి
ఆప్యాయత కృత్రిమం కావొద్దు
మమతలకు మచ్చ తేవొద్దు
ఆపదలో ఉన్న వారిని
ఆప్యాయంగా పలకరించాలి
భిన్న పనులు చేసిన పిల్లలను
ఆప్యాయంగా మందలించాలి
పిల్లలందరినీ వృద్ధులనందరిని
ఆప్యాయంగా పలకరించాలి
మానవత్వానికి రహదారి వేసి
ఆప్యాయత అనురాగాలతో
అనుబంధాల గడి కోటలు కట్టాలి
మానవత్వం పరిమళించాలి
మనుషులందరు జగతిపై
హాయిగా ఉండాలీ.



-గుండం మోహన్ రెడ్డి

## ఒయాసిస్

పెద్దలు చూపే
ఆత్మీయత, అభిమానం
పిల్లలకెంతో ఆనందం
వాత్సల్య భావన
మాటలకు అందనిది
వారి తరాలను ఉద్ధరించే
మనుమలపై చూపే ఆత్మీయత
విలువ కట్టలేనిది
ఆధునిక యుగంలో
అంతా యాంత్రిక ప్రేమలు.
అరగంట కబుర్లు
దీవెనలు కరువు
దెప్పుళ్ళ బరువు
మనుషుల మాటలు
విచిత్ర తూటాలు
అనర్థాలూ అపార్థాల
నేటి జీవితంలో
ఆత్మీయత ఓ ఒయాసిస్.



-నారుమంచి వాణి ప్రభాకరి

## ఆత్మీయత ... అనురాగం ....

భయంతోకంటే
భక్తితో ప్రేమతో
మాటలు మూట కడితే
చక్కటి ఫలితమే
అంతరంగం ప్రశాంతమైతే
మాటలన్నీ అమృతమయమే.
కోపంతో కన్నా ఆదరణతో మాట
హృదయానికి హత్తుకుంటుంది
తాను చేయలేకపోయినా
తపన పడి
పనయ్యే మార్గం చూపెడతారు.
ఆర్ద్రతతో పురమాయిస్తే
అలవికాని పనులు కూడా
ఎదురు చూపు అక్కర లేకుండా
అవలీలగా అయిపోతుంటాయి.
పెంపుడు జంతువులైననేమి
ప్రేమ ముందు మోకరిల్లుతూ
కాళ్ళ చుట్టూరా కదలాడుతూ
గార్వాలు పోయి గానమెత్తుకుంటాయి.
ఆత్మీయతలో మునిగితే
అంతే తెలియదు సముద్రంలా
అనురాగంలో ఓలలాడితే
ఆదమరిచినా అభయహస్తమే.



-నగునూరి రాజన్న

## అమృతవర్షిణి

అడక్కుండా అందించేది
అభిమానం
దీనికి కొత్త లేదు
పాత లేదు
మంచి మనసు చాలు
మమతల విలువలు!.
ఒలికించు ఆప్యాయత
ఆదరించే హృదయానికి
ఆప్యాయత ఆయువుపట్టు.
తనవారు తనకి బహుమతిగా
ఇచ్చేదే ఆప్యాయత
ఘనకార్యాలు చేయకపోయినా
మాన్యతతో
మంచి చూపితే
చాలు ఆప్యాయతే!.
మధురమైన బంధం
ఆప్యాయత అనురాగాల బంధం
ఇవి లేక జీవితమే లేదు
ఒక వరం
భగవంతుని ఆశీస్సులతో పొందాం
మనం అదృష్టవంతులం
అమృత ధార
ఈ
ఆప్యాయత మధురిమ!.



-కె.కె.తాయారు

## 'మన' అనే భావనే నాంది

వ్యక్తి ఏకాకి కాదు
సమాజమనే మహా సౌధానికి
కుటుంబమే పునాది
ఆత్మీయత,అనుబంధాలు
అనురాగాలు, బంధాలు
నైతిక విలువలే ఇటుకలు!.
మానవుని శాంతియుత,
సుస్థిర జీవనానికి
"నేను...నాది" అని కాక
"మన"అనే భావనే నాంది!.
నేడు అన్నీ కృత్రిమ సంబంధాలు
"క్విడ్ ప్రోకో" సంబంధాలు
బంధాల మధ్య సఖ్యత తరిగి
పెరిగే మానసిక దూరాలు...!
సాంకేతికతతో
ఆత్మీయ సంభాషణలు
ముఖాముఖీ మాటలు కరువు
విలువలు,బంధాలు
మార్కెట్ సరుకులు
ఆప్యాయతానురాగాలకు
మూలమైన ఉమ్మడి
కుటుంబాలు అదృశ్యం
ఆత్మహత్యలు పెరిగిపోయె!.
సంపాదన
పేరు ప్రతిష్ఠలతో కాదు
సామాజిక సంబంధాలతోనే
సంతోష జీవనం సాధ్యమని
తేల్చిచెప్పిన
హార్వర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధన!
పరస్పర ఆధారిత
సామాజిక జీవనంతోనే
పెంపొందుతుంది
వ్యక్తిత్వ వికాసం!!!.



-చంద్రకళ దీకొండ

## తరుగుతున్న తరుణం

నోటితో మాట్లాడు
నొసటితో వెక్కిరించు
అవసరాలు ఎన్నటికీ
చెప్పిరావు నిజం!!.
ఆప్యాయత తరుగు
అనురాగం కరువు
బాధ్యతల బరువు
భారమైన బతుకు!!.
తలపుల తరువు
వలపుల పరుగు
తరుణుల మదుపు
అతుకుల కుదుపు!!.
పెద్దల పరువు
చిన్నల మరపు
గగనానికి నిచ్చెన
అందకుంటే గుచ్చన!!.
కలిసి ఉండుట కల్ల
మెలిసి తిరుగుట లొల్లి
విశ్వమంత గుప్పిట్లో
ఆప్యాయతలు నెట్టింట్లో!!
ఫోజులపై మోజు
దులపరా నెత్తిలో బూజు
ప్రేమనంత పంచరా
స్నేహాన్ని పెంచరా!!.
మంచితనం మరవొద్దు
మానవత్వమే ముద్దు
వెక్కిరింపు తగదు
కొక్కిరింపు అసలు వద్దు!.



-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

## స్వర్గసీమ

అమ్మ చెల్లాయికి
ఉగ్గుపాలనాడే
కళ్లలో ప్రేమ కురిపించిన వైనం
తమ్ముడికి దెబ్బతగిలితే
ముద్దు చేసి బాధను మరిపించడం
బంధువులను నాన్న ఆప్యాయంగా
ఆహ్వానించిన తీరు
అన్నయ్య అతిథుల బాగోగులు
దర్శనీయ స్థలాల సందర్శించడంలో
తోడుగా వెళ్ళడం
అత్తవారిల్లు తనదంటూ
అందర్నీ తన ప్రేమతో ఆకట్టుకున్న
వదిన మాటతీరు
నడవడిక
నాకు ఆత్మీయత పంచడం నేర్పాయి
నా మెట్టినిల్లు
అత్తమామల
మరిది ఆడపడచుల నడుమ
మమతానురాగాల
స్వర్గసీమయ్యింది.



-వి.నాగజ్యోతి



## భరోసానిస్తుంది!

ధ్వని సాంత్వన
ఎదురుగా మాట
అక్షర భరోసా
లేఖ,ఫోన్ సందేశంలో
స్పర్శ సన్నిధిలో
ఆప్యాయత
అంతులేని ఆత్మవిశ్వాసమిస్తూ
బతుకుమీది నమ్మకంతో
తీసుకున్న దానికి రెట్టింపు
సమాజానికి ఇవ్వాలనే దృష్టిలో!.
ఎన్ని ప్రయోజనాలో?
ముఖం ముడుచుకొని
ఏదో పోగొట్టుకున్నట్టు
మనుషులు ఎలా ఉంటారో
తినడం, కట్టడం, ఊరేగడం
అన్నీ... సజావుగానే!
అయినా అసంతృప్తి చెదలు!.
ఒక మనిషి గుర్తు
ఆప్యాయత
చూపులలో
మాటలో
ప్రవర్తనలో
లేకుంటే వాడో వస్తువుకిందే లెక్క!.



-ఎం. వి. ఉమాదేవి

## అవసరం

ఆప్యాయత అనురాగం
అంతా ఒక నాటకం
అన్నాడో సినికవి
మనకి తెలుసు
అయినా అదే
కావాలి అందరికీ
అదొక నిత్యావసరం
డబ్బు లేకపోతె
అప్పు చెయ్యొచ్చు
తిండి లేకపోతె
కొన్ని రోజులు లాగొచ్చు
ఆప్యాయత లేనిదే
అస్సలుండలేం
అంతా నాటకం అనితెల్సినా
దానికోసమే పాకులాడతాం
డబ్బు చుట్టూ
ఆప్యాయత అని తెలుసు
అందుకే ధన సంపాదనే
ధ్యేయంగా శ్రమిస్తాం.



-మోటూరి శాంతకుమారి

# మూసీ నదిలో కొట్టుకొచ్చిన మహిళ మృతదేహం

హైదరాబాద్, సెప్టెంబర్ 6:గాంధీనగర్ నాలాలో గల్లంతైన మహిళ మృతదేహం మూసీనదిలో కొట్టుకొచ్చింది. మూసీ పరివాహక ప్రాంతంలో ఇవాళ ఉదయం మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. ఆ మహిళను కవాడిగూడ డివిస్‌నగర్‌కు చెందిన వెంకటేశ్ భార్య లక్ష్మి(55)గా గుర్తించారు.

లక్ష్మి ఆచూకీ తెలియటం లేదని ఆదివారం ఆవె కుటుంబ సభ్యులు గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అయితే ఇవాళ ఆమె మృతదేహం కుళ్లిన స్థితిలో మూసీ ఒడ్డున లభ్యమైంది. పోస్టుమార్టం అనంతరం లక్ష్మి మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# బైడెన్‌కి మళ్లీ కొవిడ్ నెగటివే.. జీ20 సమ్మిట్‌లో పాల్గొంటారు : వైట్ హౌస్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6: జీ20 సమ్మిట్‌కు ముందు అమెరికా ఫస్ట్ లేడీ జిల్ బైడెన్ కు కరోనా వైరస్ పాజిటివ్ తేలిన విషయం తెలిసిందే. అయితే, అధ్యక్షుడు జో బైడెన్‌కి మాత్రం నెగటివ్ వచ్చింది. భార్యకు పాజిటివ్ రావడంతో అధ్యక్షుడు ఈనెల 9-10 తేదీల్లో ఢిల్లీలో జరగబోయే జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సమావేశాలకు హాజరవుతారో లేదో అన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. దీనిపై తాజాగా వైట్ హౌస్ స్పష్టతనిచ్చింది. జిల్ బైడెన్‌కు పాజిటివ్ తేలడంతో అధ్యక్షుడికి సోమవారం, మంగళవారం వరుసగా కొవిడ్ టెస్ట్ నిర్వహించగా.. రెండు సార్లూ నెగటివ్ వచ్చినట్లు వెల్లడించింది. దీంతో బైడెన్ గురువారం ఢిల్లీ బయలుదేరనున్నట్లు తెలిపింది. 'జీ20 సమ్మిట్‌లో పాల్గొనేందుకు అధ్యక్షుడు బైడెన్ గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. శుక్రవారం ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఆ తర్వాత శని, ఆదివారాల్లో జీ20 అధికారిక సమావేశాల్లో పాల్గొంటారు' అని యూఎస్ జాతీయ భద్రతా సలహాదారు తెలిపారు.

కాగా, అధ్యక్షుడు బైడెన్ భార్య జిల్ బైడెన్‌కు సోమవారం కరోనా పాజిటివ్‌గా తేలిన విషయం తెలిసిందే. 72 ఏళ్ల ఫస్ట్ లేడీ జిల్ బైడెన్ గత కొన్ని రోజుల నుంచి స్వల్ప స్థాయిలో కొవిడ్ లక్షణాలతో ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుతం దిలావర్‌లోని రిహోబోత్ బీచ్‌లో ఉన్న ఇంట్లోనే ఆమె గడుపుతున్నారు.

జిల్‌కు పాజిటివ్ తేలడంతో 80 ఏళ్ల అధ్యక్షుడు జో బైడెన్‌కు సోమవారం కొవిడ్ పరీక్ష చేపట్టారు. ఆ పరీక్షలో ఆయన నెగటివ్‌గా తేలినట్లు వైట్‌హౌస్ తెలిపింది. నిరంతరం ఆయనకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ క్రమంలోనే మంగళవారం మరోసారి బైడెన్‌కు పరీక్షలు చేయగా.. అందులోనూ నెగటివ్ అనే వచ్చింది. దీంతో ఆయన భారత్ పర్యటనకు రాబోతున్నారు. ఢిల్లీ బయలుదేరే ముందు బైడెన్ సహా పర్యటనకు వచ్చే అధికారు లందరికీ మరోసారి కొవిడ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైట్‌హౌస్ వెల్లడించింది.






Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com